

# బాధ్యతలు చేపట్టిన క్రైమ్ డీసీపీ జనార్ధన్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా జనార్ధన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1989 ఎస్సై బ్యాచ్‌కు చెందిన జనార్ధన్ వరంగల్, ఖమ్మం, సీఐడీ విభాగాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లో అదనపు ఎస్పీగా పని చేస్తున్న జనార్ధన్‌కు డీసీపీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.

– వరంగల్ వాయిస్, క్రైం

వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 156
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
మార్చి 17, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# కాంగ్రెస్‌లో.. జోష్

వివరాలు 2లో..

## స్టేషన్ ఘన్‌పూర్ సభ సక్సెస్





నియోజకవర్గంలో గట్టి పునాది వేస్తున్న కడియం కావ్యకు 'ప్రజాపాలన–ప్రగతి బాట' పేరిట స్టేషన్ ఘనపూర్ లో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయింది. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా భారీగా జనం తరలి రావడంతో కాంగ్రెస్ పార్టీ నేతల్లో జోష్ కనిపిస్తోంది. అనుకున్న సమయానికంటే ముందుగానే సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా రూ.800 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన చేయడంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఇక్కడి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులతో కడియం కుటుంబానికి స్టేషన్ ఘనపూర్ లో విపరీతమైన పాపులారిటీ దక్కింది. రానున్న రోజుల్లో కడియం కావ్య ఇదే నియోజకవర్గంనుంచి ప్రాతినిధ్యం వహించేందుకు ఇప్పటినుంచే అడుగులు పడుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి

- భారీగా తరలి వచ్చిన మహిళలు
- రూ.800 కోట్ల పనులకు శంకుస్థాపన
- ఆనందంలో కడియం శ్రీహరి, ఎంపీ కావ్య


2లో..

# ఎంజీఎం స్థితిగతులపై పోరాడుతాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపు


2లో..

# సమస్యలపై స్పందించండి

- ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


7,8లో..

4th ANNIVERSARY CELEBRATIONS

# పబ్లిక్ వాయిస్.. వరంగల్ వాయిస్

## విజయవంతంగా నాలుగేళ్ల ప్రస్థానం

- ప్రజల గొంతుకగా నిలుస్తోంది :
  - బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నలుబొల రమేష్
- సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు : గడ్డం భాస్కర్
- సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతోంది :
  - గడ్డం కేశవమూర్తి

# కాంగ్రెస్‌లో.. జోష్




- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- భారీగా తరలి వచ్చిన మహిళలు
- రూ.800 కోట్ల పనులకు శంకుస్థాపన
- ఆనందంలో కడియం శ్రీహరి
- నియోజకవర్గంలో కావ్యకు గట్టి పునాది వేస్తున్న శ్రీహరి

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** కడియం శ్రీహరి అధ్యక్షతన 'ప్రజాపాలన-ప్రగతి బాట' పేరిట స్టేషన్ ఘనపూర్ లో నియోజకవర్గం పరిధిలోని శివుని పల్లిలో నిర్వహించిన బహిరంగ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. కేవలం ఒకే ఒక నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాలనుంచి 50వేలకు పైగా జనం తరలి రావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలతో పార్టీకి మరింత ఆదరణ పెరుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



### రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు..

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రూ.800 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రూ.200 కోట్లతో జఫర్ గడ్ మండలం కోనాయచలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రూ.5.5కోట్లతో ఘన్ పూర్ లో డిగ్రీ కళాశాల, రూ.45.5 కోట్లతో వంద పడకల అసుపత్రి నిర్మాణం, రూ.26 కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ లెవల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం, రూ.148.76 కోట్లతో దేవాదుల రెండో దశ ప్రధాన కాలువ సీసీ లైనింగ్, రూ.25.60 కోట్లతో 512 ఇందిరమ్మ ఇళ్లకు యూనిట్ కు రూ.5లక్షల చొప్పున, రూ.15 కోట్లతో జాతీయ రహదారి నుంచి మల్లన్నగండి తాటికొండ, జిట్టగూడెం, తరిగొప్పుల వరకు రహదారి విస్తరణ, రూ.23.5 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్వహణ, ఒక కోటితో స్టేషన్ ఘన్ పూర్ లో ఎన్పీడీసీఎల్ డివిజనల్ కార్యాలయ నిర్మాణం, రూ.2 కోట్లతో బంజర భవన్ నిర్మాణం, రూ.11.90 కోట్లతో గోవర్ధనగిరి నుంచి చర్లతండ వరకు రహదారి నిర్మాణం, రూ.3.70 కోట్లతో నక్కలపొక్కల తండ నుంచి పోతరాజు గండి వరకు బీటీ రోడ్డు, రూ.3.49 కోట్లతో సేవ్య తండానుంచి కచేర్ తండా వరకు బీటీ రహదారి నిర్మాణం, రూ.2.80 కోట్లతో ఫతేషాపూర్ నుంచి రామచంద్రగూడెం వరకు బీటీ రోడ్డు, రూ.1.76 కోట్లతో కుడా ఆధ్వర్యంలో పెద్ద పెండ్యాల వద్ద రహదారి విస్తరణ, రూ.102.10 కోట్లతో మహిళా శక్తి కింద ఏడు ఆర్టీసీ బస్సుల మంజూరు, రూ.65 లక్షలతో తెలంగాణ నూనె గింజల సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సేకరణ కేంద్రం ఏర్పాటుకు సీఎం శంఖుస్థాపన చేశారు. అదే విధంగా స్టేషన్ ఘన్ పూర్ పంచాయతీని పురపాలికగా అప్ గ్రేడ్ కు శ్రీకారం చుట్టారు. దీనిని తోడు రూ.2.26 కోట్లతో రఘునాథపల్లి మండలం కుర్చపల్లి, రూ.2.29 కోట్లతో జఫర్ గఢ్ మండలం సాగరం, రూ.2.50 కోట్లతో చిల్పూర్ మండలం కొండాపూర్, రూ.2.48 కోట్లతో రఘునాథపల్లిలోని ఫతేషాపూర్, రూ.1.48 కోట్లతో ధర్మసాగర్ మండలం రాయగూడెంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

### కడియం కావ్యకు జనం నీరాజనం..

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో డాక్టర్ కడియం కావ్యకు జనం నీరాజనం పలుకుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కడియం శ్రీహరితో కలిసి కడియం కావ్య బాటలు వేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఇతర ఉన్నతాధికారులతో సంప్రదింపులు జురుపుతూ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి మార్గంలో పయనించేందుకు పాటుపడుతున్నారు. రానున్న రోజుల్లో కడియం కావ్య స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి ప్రాతినధ్యం వహించే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకోసమే కడియం కావ్య నియోజకవర్గంలో గట్టి పునాది వేసుకుంటున్నట్లు చర్చించుకుంటున్నారు.













## సమస్యలపై స్పందించండి

- ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ వాయిస్, వరంగల్/హనుమకొండ :** వివిధ సమస్యలపై గ్రీవెన్స్ లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రావీణ్య, వరంగల్ కలెక్టరేట్ లో డాక్టర్ సత్య శారద, బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. హనుమకొండ జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రజలనుంచి 76 దరఖాస్తులు రాగా, వరంగల్ జిల్లాలో 94 దరఖాస్తులు అందాయని అధికారులు ప్రకటించారు. అదే విధంగా బల్దియా కార్యాలయంలో 88 అర్జీలు అందాయి.

## ఎంజీఎం స్థితిగతులపై పోరాడుతాం



**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపు**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పాలకులు మారినా స్థితిగతులు మారని ఎంజీఎం హాస్పిటల్ పై భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 19న మహా ధర్నా నిర్వహించనున్నట్లు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఎంజీఎం ఆస్పత్రిని బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. వరంగల్ ప్రజల ఆత్మ గౌరవ పోరాటం పేరిట మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, మాచర్ల దీన్ దయాల్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోవింద్ సింగ్, కార్యాలయ సెక్రటరీ పెద్ది నవీన్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు జెట్లింగ్ శివప్రసాద్, తోట సురేష్, నాయకులు కందుకూరి శ్రీనివాస్, విట్టల్ బోర, తదితరులు పాల్గొన్నారు.

### బంగారు లక్ష్మణ్ కు ఘన నివాళి

దళిత హక్కుల ఉద్యమ నేత, కార్మిక నాయకుడు, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ 86వ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ అధ్యక్షతన సోమవారం ఘన నివాళులు అర్పించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని కాశిబుగ్గ వెల్ఫేర్ సొసైటీలోని ఓ అనాధ ఆశ్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆశ్రమానికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ఎర్రగట్టు గుట్ట జాతరను చూసేందుకు వస్తున్న ముగ్గురు యువకులు ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ముచ్చర్ల గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం అధిక వేగంతో యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు, యువకుల స్నేహితులు 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం హాస్పిటల్ కు తరలించారు. అయితే, మేకల సుశాంత్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. తాండ్ర విజయ్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చెన్నంగుల వర్ధన్ ప్రస్తుతం హనుమకొండలోని ఏకశిల హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై బాధితుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చదువుతో ఉన్నత శిఖరాలకు చేరొచ్చు

**➲ శంతన్ రామరాజు**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** చదువే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు అన్నాడు. సోమవారం శనిగపురం జిల్లా పరిషత్ హైస్కూల్ లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాశరథి శ్రీధర్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శంతన్ రామరాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. శనిగపురం పాఠశాలలో పోయినేడు పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం విజయం సాధించడం గొప్పవిషయమన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా విద్యార్థులకు జూమ్ క్లాసుల ద్వారా ఉదయం 4 గంటలకే నిద్ర లేపి స్టడీ క్లాసులు నిర్వహించడం విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల చిత్తశుద్ధిని తెలుయజేస్తోందని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు సమయపాలన, ఆర్థిక క్రమశిక్షణ లాంటి ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా తల్లిదండ్రుల కలలను, చదువు చెప్పిన గురువుల గౌరవాన్ని, మన ఆశయాలను నిజం చేసుకోవచ్చని హితవు పలికారు. పెద్దల పట్ల, సమాజం పట్ల, దేశంపట్ల ఎప్పుడూ ప్రేమను కనబరుస్తూ ముందుకెళ్లాలని అన్నారు. మనం చదివినా, ఆడినా, పాడినా ఏపనిచేసినా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకెళ్లాలని ఉద్బోధించాడు. నీడకు భౌతిక రూపం లేకపోయినా అది మనల్ని వెన్నంటే ఉంటుందని అలాగే ఉన్నత చదువుకు భౌతిక రూపం లేకపోయినా మన జీవితాన్ని నిర్దేశిస్తుందని అన్నారు. ఆడుతూపాడుతూ పదోతరగతి పూర్తిచేసుకుంటున్న విద్యార్థులు ఇకనుండి తమభవిష్యత్తును తామే డిజైన్ చేసుకోవాలన్నారు. శనిగపురం ప్రభుత్వ పాఠశాల చదువు, సంస్కారం, ఉత్తమ ఫలితాల్లో మానుకోట జిల్లాకే తలమానికంగా ఉంటుందన్నారు. విద్యార్థుల పట్ల అమిత శ్రద్ధాశక్తులు కనబరుస్తున్న అధ్యాపక బృందాన్ని అభినందించారు. అనంతరం నూరు శాతం హాజరు పట్టిక సాధించిన విద్యార్థులకు జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా 10/10 మార్కులు సాధించిన విద్యార్థులకు కరతాల ధ్వనుల మధ్య ఐదు వేల రూపాయల పారితోషికం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది జి.వెంకన్న, చాగంటి ప్రభాకర్, బి.వెంకన్న, చైతన్య, పర్వతాలు, మంజులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తిభావం పెంపొందించుకోవాలి

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఎల్లమ్మ గుడి స్థలానికి రూ.50,000 విరాళం ఇచ్చి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మరోమారు తన సహృదయత చాటుకున్నారు. రాయపర్తి మండలం మైలారం గ్రామంలో స్థానిక ఎస్సీ కాలనీలో చిర్ర పంగ వాళ్లకు సంబధించిన ఎల్లమ్మ గుడికి భూమి అవసరం నిమిత్తం, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి అడుగగా తక్షణమే స్పందించి భూమి అవసరానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగా రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలామంచ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు సంధి దేవేందర్ రెడ్డి, గబ్బేట యాకయ్య, గజావెల్లి ప్రసాద్, కోలా సంపత్, ఎల్లస్వామి, చిర్ర భిక్షపతి, చిర్ర ఎల్లయ్య, చిర్ర సోమన్న, చిర్ర యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జవ్వాజి కుమార్, మాజీ వార్డు మెంబర్లు తాళ్లపల్లి గణేష్, ఎలగం రవి, రహమతుల్లా రఫీ, గుంపుల జైపాల్ తో సహా 20 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులమై ప్రణవ్ బాబు నాయకత్వంలో పనిచేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరామని మాజీ సర్పంచి జవ్వాజీ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి-రవీందర్, టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి వాసాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండపు చరణ్ పటేల్, బాలసాని రమేష్ గౌడ్, పుల్లూరి శ్రీనివాసరావు, పోడేటి భిక్షపతి, కేత్తే రవి, మార్కెట్ డైరెక్టర్ ఆకినపల్లి భిక్షపతి, పైసా శరత్, తోట శంకర్, కుక్కల ఓదేలు, తాజుద్దీన్, కొల్లూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రం శివారులోని శ్రీ జగన్నాథ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. స్వామి వారికి అర్చకులు వైభవంగా చక్ర స్నానం జరిపించారు. తొలుత స్వామి వారికి వందలాది మంది భక్తుల నడుమ శాస్త్రోక్తంగా విశేష అలంకరణలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ వెల్లువెత్తిన భక్తిపారవశ్యం మధ్య 108 కళశాలలో వివిధ సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో మహా పూర్ణహుతి , వసంతోత్సవాలు నిర్వహించారు. అనంతరం చూడముచ్చటగా పరమ పవిత్రంగా కనుల పండుగగా స్వామి వారికీ చక్ర స్నానం జరిపించారు. ఈ చక్ర స్నానం ఉత్సవంలో పాల్గొనడం వల్ల భక్తులకు తాము కోరుకున్న కోరికలు నెరవేరి, ఆర్థిక ఇబ్బందులు, శత్రు బాధలు తొలగి ఆయురారోగ్యాలతో జీవించడమే గాకుండా సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్సవమూర్తులను ఆలయం నుంచి పల్లకిలో పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం త్రిశూల స్నానం చేపట్టారు. ఈ రకమైన ఆధ్యాత్మిక సేవ మరి ఎక్కడా కనిపించదు. ఎంతో పవిత్రత అంతకుమించిన మహాత్యంతో కూడిన చక్ర స్నానం ప్రక్రియ పౌరాణికంగా ఎంతో శక్తివంతమైంది. స్వామి వారికి చక్ర స్నానం అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేసిన పలు రకాల నైవేద్యాలను సమర్పించి స్వామి ఏకాంతంగా పవళించుటకు పవళింపు సేవను భక్తుల సమక్షంలో ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

# సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాలకు చెందిన 104మంది లబ్ధిదారులకు మొత్తం రూ.33,93,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బ్లాక్, వివిధ మండల అధ్యక్షులు హామ్యానాయక్, ముద్దశాని సురేష్, విజయ పాల్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గట్లకానిపర్తి అమ్మాయికి నంది అవార్డు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కేఎన్ డీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా త్యాగరాయ గానసభ చిక్కడపల్లిలో అవార్డు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వ విఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చర్ అకాడమీ జాతీయ స్థాయి ఉగాది పురస్కారాలు-2025 కు బొమ్మకంటి పవన్ కుమార్-మాధురి దంపతుల కూతురు బొమ్మకంటి హాన్విక (ప్రిన్సి)కి నంది అవార్డును ప్రదానం చేయడం జరిగింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందని హాన్విక డాన్స్ కాంపిటీషన్ లో నంది అవార్డును పొందారు. డాక్టర్ ఎస్వీఆర్ వెంకటేష్, గాయకులు చైర్మన్ చేతుల మీదు డ్యాన్స్ మాస్టర్ కళ్యాణ్, ఖుషి మాస్టర్ ల ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకోవడం జరిగింది.

# మహిళా సిబ్బందికి చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** స్థానిక వ్యవసాయ మార్కెట్ లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి హోలీ పండుగను పురస్కరించుకొని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పుల్లూరి స్వప్న సదానందం సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ హోలీ పండుగను పురస్కరించుకొని తమ కార్యాలయంలో పనిచేస్తున్న తోటి మహిళా సోదరిమణులకు చీరలు పంపిణీ చేయడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఉత్తర తెలంగాణలోని రెండో స్థానంలో ఉన్న అతిపెద్ద జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తను కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహిళ సోదరీమణులకు ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకు వస్తే రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబుల సహకారంతో తను మార్కెట్ చైర్మన్ ఉన్నంతకాలం మహిళా సోదరీమణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయం మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఆర్.మల్లేశం, ద్వితీయ శ్రేణి సెక్రెటరీ ఎన్.రాజు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని భర్తరఫ్ చేయాలి

## ◆ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాసనసభలో దళిత స్పీకర్ ను అగౌరవపరిచేలా వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా పరకాల బస్ స్టాండ్ కూడలిలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేండ్ల పాలనలో మీ నాయకుడు కేసీఆర్ దళిత నాయకుడిని సీఎం చేస్తా అని చెప్పి చేయని చరిత్ర మీ పార్టీ కాదా అని ప్రశ్నించారు. మీరు చేయని కుల గణన, ఎస్సీ కుల వర్గీకరణతో దళితులలో రాష్ట్ర ప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణ చూడలేక ఒక్క రాజ్యాంగ పదవిలో ఉన్న సభాపతిని కించపరుస్తూ మీ దొర అహంకారని వెళ్లకక్కుతూ ప్రభుత్వం పై బురద చల్లే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ, కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్



కొలుగురి రాజేశ్వర్ రావు, సమన్వయ కమిటీ సభ్యులు పంచగిరి జయమ్మ, చిన్నల గౌనాథ్, రంజాన్ అలీ, ఏకు రాజు, మార్క రఘుపతి, పసుల రమేష్, పసుల విజయ, ఒంటెరు శ్రవణ్, పోరండ్ల వేణు, గడ్డం శివ, దుబాసి వెంకట స్వామి, బొచ్చు రవి, గొట్టే రమేష్ తో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు




**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 19 ఫిర్యాదులు సమర్పించారని, వాటిలో ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ ఉపాధి, ఆసరా పెన్షన్లు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయచందర్ రెడ్డి కోలుకోవాలని కొమ్మాలలో పూజలు



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డికి ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరగగా ఆరోగ్యంగా ఉండాలని గీసుగొండ మండల బీజేపీ ఆధ్వర్యంలో శ్రీ కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ చందర్ రెడ్డి గారు త్వరగా కోలుకొని మళ్లీ ప్రజా జీవితంలో, వైద్య వృత్తిలో ప్రజలకు సేవలందించాలని స్వామివారిని కోరుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి జిల్లా కౌన్సిల్ మెంబర్ నిమ్మగడ్డ జాన్ విక్రమ్ తలనీలాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నిమ్మగడ్డ జాన్ విక్రమ్, నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, నాయకులు ఏడాకుల రాజిరెడ్డి, ఆకుల వెంకన్న, మరిపూడి శ్రీనివాస్, మరిపూడి రోశయ్య,ఉట్ల రాసుధరెడ్డి, అరకట్ల ప్రవీణ్, కోట శివ కుమార్, కేలోత్ రమేష్, కాగితాల సాయి పాల్గొన్నారు.

# ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సామా జగన్ మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతుల పోస్టర్లు హనుమకొండ డీఐఈఓ గోపాల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత కార్య సమితి సభ్యులు పాల్గొని మాట్లాడుతూ గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులు బాలసముద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీ పై చదువులకు ఈ ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులు ఎంతోగానో దోహదపడతాయని తెలిపారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతున్న ఉచిత ఎంసెట్ శిక్షణ తరగతులకు రిజిస్ట్రేషన్ కోసం 7995990561, 81066 19193 నెంబర్లను సంప్రదించండని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భరత్, శ్రీకాంత్, హరిచరణ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళకు చెక్క బల్ల అందజేత




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ రామన్నపేట లోని డాక్టర్.ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధ మహిళ అయిన రాజ్యలక్ష్మికి మానవతా దృక్పథంతో చెక్క బల్ల పంపిణీ చేయడం జరిగింది. వృద్ధురాలైన రాజ్యలక్ష్మి కింద పడుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రాజేంద్రప్రసాద్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళ రాజేంద్రప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, స్థానిక మహిళలు ఎల్లమ్మ, మల్లమ్మ, కుసుమ కుమారి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



**వరంగల్ వాయిస్, పరకాల :** రూరల్ మండలం హైబోత్ పల్లి గ్రామంలో జరుగుతున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు, డాక్టర్ కాళీప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబు యాదవ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు దయ్యాల దేవరాజ్, మాజీ మండల అధ్యక్షులు ముస్కె దేవేందర్, నాయకులు సంపత్, లింగయ్య, మహేందర్ రెడ్డి, భగత్, సంపత్ రావు, లింగా రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



**వరంగల్ వాయిస్, పెద్దపల్లి :** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆదేశానుసారం మేరకు అందుబాటులో ఉన్నా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎల్.సురేష్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన 510 జీఓలో మిస్సైన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వివిధ రాష్ట్రాల రెగ్యులర్ చేసిన విధంగా తెలంగాణలో కూడా రెగ్యులర్ చేయాలని (లేదా) సుప్రీమ్ కోర్టు ఆదేశం మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ సానుకూలంగా స్పందించి సెంట్రల్ గవర్నమెంట్ కు మెయిల్ ద్వారా తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

# విద్యార్థులకు కళ్లజోడుల పంపిణీ



**వరంగల్ వాయిస్, ఖానాపూర్ :** ఆర్బీఎస్కేబీ టీం ఆధ్వర్యంలో సోమవారం ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్, వజినపల్లి స్కూల్ లో కళ్లజోడుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో గత సంవత్సరం విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా, నిపుణులైన వైద్యులు డాక్టర్ గిరిధర్ రెడ్డి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేందర్ నేడు కళ్లజోడులు అందజేశారు. పరీక్షల అనంతరం 22 మంది విద్యార్థినులకు కళ్లజోడులు అవసరమని గుర్తించగా, ఇప్పటివరకు 8 మందికి కళ్లజోడులు అందజేయడం జరిగింది. కళ్లజోడులు పొందిన విద్యార్థినులు తమ చూపులో మెరుగుదనం వచ్చిందని ఆనందం వ్యక్తం చేసి, ఈ సహాయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీ, ఏఎన్ఎం శిరీష, దివ్య, ఫార్మసిస్ట్ అన్నపూర్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గుండా రవీందర్ పాల్గొన్నారు.

# జగదీశ్వర్ రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దళితుడనే చిన్నచూపుతో ఏక వచనంతో, అమర్యాదగా మాట్లాడిన సందర్భంగా జమ్మికుంట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమనేని పరుశురామరావు ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం గాంధీ చౌరస్తాలో జగదీశ్ రెడ్డి, కేటీఆర్ ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,బీఆర్ఎస్ గత పది సంవత్సరాలలో దళితులకు అన్యాయం చేయడం యావత్ తెలంగాణ చూసిందన్నారు. దళితులను ఏ రోజు కూడా పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక దళితుడిని స్పీకర్ గా నియమిస్తే జీర్ణించుకోలేని జగదీశ్వర్ రెడ్డి, కేటీఆర్ లు అసెంబ్లీ సాక్షిగా అవమానించడం తీవ్ర ఆక్షేపణీయం అన్నారు. జగదీష్ రెడ్డి, కేటీఆర్ లను ఎమ్మెల్యే పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదానందం, డీసీసీ ప్రధాన కార్యదర్శి



గూడెపు సారంగపాణి, మహిళా పట్టణ అధ్యక్షురాలు పూదరి రేణుక-శివకుమార్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లాప్రధాన కార్యదర్శి పర్లపెల్లి నాగరాజు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అక్కినపల్లి శ్యామ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, నాయకులు అంబాల రాజ్ కుమార్, సాంబశివరెడ్డి, వాసాల రామస్వామి, వానరసి జాన్, గాజ వీర గోపాల్, రాచపల్లి శ్రీనివాస్, లింగారావు, వెంకటేష్, గోలి రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**◆ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టొప్పో సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో (రెవెన్యూ) అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారితో కలసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల వారితో సమన్వయ పరుస్తూ దరఖాస్తుదారులకు దిశా, నిర్దేశం చేసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖలకు చెందిన మొత్తం (69 ) దరఖాస్తులు వచ్చాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పురుషోత్తం, డీఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, సీపీఓ సుబ్బారావు, ఏడీ సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్, హార్టికల్చర్ అధికారి మరియన్న, గ్రౌండ్ వాటర్ డీడీ సురేష్, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, మత్స్య శాఖాధికారి వీరన్న, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, వివిధ మండలాల డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

# అడప మహేష్ ఆగడాలను అరికట్టాలి



**■ స్థానిక మహిళల ఆందోళన**

**వరంగల్ వాయిస్, ఏనుమాముల :** వరంగల్ ఎన్టీఆర్ నగర్ కాంగ్రెస్ నాయకుడు అడప మహేష్ వేధింపుల నుంచి కాపాడాలని పలువురు మహిళలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రోజురోజుకు అతని ఆగడాలు పెరిగిపోతున్నాయని, మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. తమకు చెందిన డబ్బులు తిరిగి ఇప్పించాలంటూ ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఈస్ట్ జోన్ డీసీపీ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అడప మహేష్ అధికార పార్టీ పేరు చెప్పి బెదిరించడం, భూమి వివాదాల్లో జోక్యం చేసుకోవడం, స్టేషన్ పంచాయతీ వ్యవహారాల్లో సెటిల్మెంట్లు చేయడం, గతంలో ఉన్న పదవులను ఇప్పటికీ కొనసాగుతున్నట్లుగా చెప్పుకోవడం, కులం పేరుతో బడా రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్నట్లు ప్రచారం చేసుకోవడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. అంతేకాక, అతను ఓ మీడియా ఐడి కార్డు ఉపయోగించి భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అడప మహేష్ వద్ద ఉన్న మీడియా ఐడి కార్డు నిజమైనదా? అతని కార్యకలాపాలు ఎంతవరకు చట్టబద్ధంగా ఉన్నాయో ఎనుమాముల పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నది బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించి అతనిపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచిచూడాలి.

# నిర్లక్ష్యంగా సర్జరీ చేసిన వైద్యులను సస్పెండ్ చేయాలి

**➲ ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల**



వరంగల్ వాయిస్, వరంగల్ : సీకేఎం ఆసుపత్రిలో నిర్లక్ష్యంగా శస్త్రచికిత్సలు చేసిన సంబంధిత వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో సీకేఎం ఆసుపత్రి ఎదుట భారీ నిరసన చేపట్టారు. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌కు చెందిన ఈర్ల వెన్నెల అనే యువతి మార్చి 11న సీకేఎం ఆసుపత్రిలో పురుడు పోసుకుంది. అయితే, సర్జరీ నిర్వహించే క్రమంలో వైద్యులు బాధితురాలి పొట్టలో ప్యాడ్ (ధూది) మరిచిపోయి కుట్లు వేసి ఇంటికి పంపించారు. ఇంటికి చేరిన వెన్నెల మూడు రోజుల పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, ఆమెకు 66 శాతం ఇన్ఫెక్షన్ వచ్చిందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటన తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వైద్యులను తక్షణమే సస్పెండ్ చేయాలని రత్నమాల డిమాండ్ చేశారు. అలాగే, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం అందించడంతో పాటు వెన్నెలకు అయ్యే వైద్య ఖర్చును ప్రభుత్వం భరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఐద్వా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. అనంతరం హాస్పిటల్ ఆర్ఎంఓ మురళి, సూపరింటెండెంట్ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు టి.భవాని, ఎండీ. బేగం, జిల్లా సహాయ కార్యదర్శులు బి.సంగీత, ఏ.వాణి, జిల్లా కమిటీ సభ్యులు మైదం వినోద్, ఎస్.కె. హసీనా, ఎన్టీఆర్ నగర్ కాలనీ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**వరంగల్ వాయిస్, దామెర:** మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ కాలువలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కొంక అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం మండల పరిధిలోని ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం కొట్టుకొని రాగా, స్థానికులు తమకు సమాచారం అందించగా, వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్, పరకాల రూరల్ సిఐ రంజిత్ రావు లతో కలిసి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. ఎస్సారెస్పీ కాలువ ప్రవాహం ఎక్కువగా ఉండడంతో, ఎస్సారెస్పీ డీ ఈ తో మాట్లాడి, నీటి ప్రవాహాన్ని తగ్గించి స్థానికుడైన పండుగ శ్రీను సహకారంతో, మృతదేహాన్ని కాలువ లో నుంచి బయటకు తీశారు. మృతదేహం లభించిందని వివిధ పోలీస్ స్టేషన్ లకు సమాచారం అందించగా, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చ్ 8 వ తేదీన ఎస్సారెస్పీ కెనాల్ లో కొట్టుకు పోయిన వ్యక్తిగా అనుమానంతో, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఎల్కత్తుర్తి పోలీసులు,మృతుని కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా, తమ కుమారుడు ఎల్కతుర్తి కి చెందిన మహమ్మద్ సలీం ( 25 ) గా గుర్తించారు. మృతదేహంను చూసిన కుటుంబ సభ్యులు రోదించారు. కెనాల్ లో పడి చాలా రోజులు కావడం వల్ల మృతదేహం డీ కంపోజ్ కావడంతో, వైద్యులను ఘటనా స్థలానికి పిలిపించి అక్కడే పంచనామా, పోస్ట్ మార్టం ను నిర్వహించి మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అందించామని ఎస్సై అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు...

# కొనసాగుతున్న ఎర్రగట్టుగుట్ట బ్రహ్మోత్సవాలు

**హాజరైన ఎమ్మెల్యే నాగరాజు**



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** ఎర్రగట్టుగుట్ట శ్రీ శ్రీ శ్రీ స్వయంభూ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే నాగరాజుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అరెల్లి లింగస్వామి, డైరెక్టర్లు, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మానీ శేఖర్ రావు, మాజీ కార్పొరేటర్ జక్కుల శ్రీనివాస్, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, వీసం సురేందర్ రెడ్డి, మార్క రాజు, చిర్ర రాము, సంతోష్, గడ్డం అరుణ్, వరుణ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.

# అన్ని రంగాల్లో దూసుకెళుతున్న మహిళలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలు ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరని, వారికి ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వరంగల్ హంటర్ రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ భూక్య బాబురావు, పరిశోధక విద్యార్థినీ పతకమూడి విజయశాంతిని శాలువాతో సన్మానించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ వేడుకలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమంతుల దామోదర్, డా. చూరేపల్లి రవికుమార్, డా. బాసాని సురేష్, అబ్బు గోపాలరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డా. గంపా సతీష్, సిబ్బంది సిద్ధోజు సునంద, అంజనేయులు, అశోక్, కస్తూరిబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్ ఉదయం మరణించగా వారి పార్థివ దేహానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాలవేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చడం జరిగింది. నివాళులు అర్పించిన వారిలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజి, మండల పార్టీ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు బోనాసి క్రాంతి, జిల్లా నాయకులు గోరిగే రవి, మార్కెట్ డైరెక్టర్ బంధ కుమార్, తదితరులు నివాళులు అర్పించారు. అలాగే, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్ మణికంఠ, నిడిగొండ పీఏసీఎస్ చైర్మన్ గంగిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, పేర్ని రవి ఉష, ప్రజాప్రతినిధులు తదితరులు పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం హర్షణీయం

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాసనసభలో బీసీల రిజర్వేషన్ బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదించబడటాన్ని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షించారు. ఈ సందర్భంగా బిల్లులకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టిన బీసీల విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్, అలాగే గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. ఈ చర్య తెలంగాణవ్యాప్తంగా బీసీ సంఘాలు నిర్వహిస్తున్న ఉద్యమాలకు పెద్ద విజయమని వెంకట్రాములు పేర్కొన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు, రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన చేపట్టి, విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లులను వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపించి, అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులతో కూడిన అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వెంకట్రాములు సూచించారు. పార్లమెంటులో బిల్లులను ఆమోదింపజేసి, 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని, ప్రధానమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని, తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ రిజర్వేషన్ బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందేందుకు కృషి చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.


# నాగయ్య పల్లెలో న్యాయవాది మహేందర్ పుట్టినరోజు వేడుకలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు అందిస్తూ న్యాయ సహాయాన్ని అందించడమే కాకుండా పేదలకు చెందిన అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు దక్కేందుకు పోరాడుతున్న నాయకుడు కలకోటి మహేందర్ అని దళిత బహుజన ఫ్రంట్ డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని నాగయ్య పల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి(ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకోటి మహేందర్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకొని పేదలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కలకోటి మహేందర్ మాట్లాడుతూ పేదలకు చెందిన అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు వచ్చేంతవరకు పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గోల్కొండ బుచ్చన్న, మాదాసి శ్రీనివాస్, ముత్తినేని లచ్చయ్య, ఎల్కుర్తి రామన్న, గిన్నారపు భాస్కర్, గిన్నారపు ప్రసంగి, మాదాసి కరుణాకర్, మాదాసి నవీన్, మాదాసి సిద్ధార్థ, మాదాసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోవర్ధనం వేణుగోపాల్ కు రాష్ట్రస్థాయి అవార్డు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ గవర్నర్ బిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ వార్తా చిత్రం అవార్డును జనగామ సాక్షి ఫొటోగ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వేణుగోపాల్ కు అభినందనలు తెలిపారు.



# ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయండి

## సైకాలజిస్ట్ పోగు అశోక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను రాయబోతున్నారు. ఈ సమయంలో చాలామందికి తెలియని భయం, ఒత్తిడి ఉండే అవకాశం ఉంది. విద్యార్థులు భయాన్ని, ఒత్తిడిని దూరంగా ఉంచుకుని పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోగు అశోక్ సూచిస్తున్నారు. "నేను బాగా చదవగలను, నేను పరీక్షలను విజయవంతంగా రాయగలను, నాకు మంచి ఫలితాలు వస్తాయి" అనే ధైర్యంతో ముందుకు సాగాలి. మీ మీద మీకు నమ్మకం కలిగి ఉంటే, విశ్వాసం ఉంటే, ఏదైనా సాధించగలరు. మహోన్నత విశ్వాసం ఉన్నచోట మహత్తర విజయాలు సాధించబడతాయి. ఆత్మవిశ్వాసం మీ ఆయుధమైతే, విజయం మీ బానిస అవుతుంది. ప్రతి సబ్జెక్టును ప్రణాళిక ప్రకారం, ఆసక్తితో చదవాలి. ఆసక్తి ఉంటే, ఏ శక్తి మిమ్మల్ని ఆపలేరు. ఈ సమయంలో విద్యార్థులు మనసులో ఎలాంటి నెగటివ్ ఆలోచనలను దరిచేరనీయకుండా, గతంలో సాధించిన విజయాలను గుర్తుచేసుకోవాలి. దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరిగి, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయగలుగుతారు. సమయం పట్టుకుంటే పాదరసంలా జారిపోతుంది. ఇది అత్యంత విలువైనదిగా గ్రహించి, ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బంగారంలోని ప్రతి చిన్న కణానికి ఎంతటి విలువ ఉంటుందో, ఇప్పుడు మీ ముందున్న ప్రతి క్షణం అంతే విలువైనదని గుర్తుంచుకోవాలి. అలా సమయాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటే, మీరు విజయపథంలో నిలుస్తారు. ఈ సమయంలో సెల్ ఫోన్లు, టీవీ, సోషల్ మీడియా, చాటింగ్ లాంటి సమయాన్ని వృధా చేసే విషయాలకు దూరంగా ఉండాలి. కాలం మీ కోసం ఆగదు, కరిగిపోయిన క్షణం తిరిగి రాదు. "కాలం వెంట పరిగెత్తు, విజయాలను సాధించు" అనే మహాత్ముడి మాటలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి పరీక్షలను అద్భుతంగా రాయాలి. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. సాత్విక, శాఖాహారమైన, తొందరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ లకు దూరంగా ఉండాలి. శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచేందుకు మధ్య మధ్యలో తగినంత నీటిని తాగాలి. ఎవరైనా ఒత్తిడికి లోనైతే, పరీక్షలంటే భయం కలిగినట్లయితే, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ విద్యార్థులకు సహాయం అందిస్తుంది. విద్యార్థులు తమ ఒత్తిడిని, భయాన్ని తొలగించుకోవడానికి 9391117100, 9440890073 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని పోగు అశోక్ తెలిపారు.

# వన్నాలకు మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అటల్ బిహారి వాజపేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ నగరానికి విచ్చేసిన మాజీ గవర్నర్ విద్యా సాగర్ రావు సమావేశం అనంతరం మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు సతీమణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ తల్లి వన్నాల విజయలక్ష్మి ఇటీవల మరణించగా హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని వారి స్వగృహంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ డా. రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలన్ సంతోష్ రెడ్డి, కార్పొరేటర్ రావుల కిషన్, మాజీ జడ్పీ చైర్మన్ గజ్జెల శ్రీరాములు తదితర సీనియర్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్బీఎస్కే)ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 17 నుండి 28వ తేదీ వరకు మహబూబాబాద్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో నిపుణులైన కంటి వైద్యులు ఈ పరీక్షలు చేపట్టారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హై స్కూల్‌లో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. మురళీధర్ చేతుల మీదుగా ఏడుగురు విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, మొత్తం 633 మంది విద్యార్థుల్లో సూక్ష్మమైన కంటి లోపాలను గుర్తించామని, వీరందరికీ కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా 274 మంది విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ నరసయ్య, నోడల్ అధికారి డాక్టర్ కుమార్, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమ్య లత, ఫార్మసిస్ట్ శ్రీలక్ష్మి, ఏఎన్ఎం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# 60 ఫీట్ల రహదారికి శివనాగేంద్ర నగర్ పేరు

## తాత్కాలిక కమిటీ ఏకగ్రీవ నిర్ణయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ అండర్ రైల్వే గేట్ పరిసర ప్రాంతంలోని 33వ డివిజన్‌లో కొత్తగా నిర్మించిన 60 ఫీట్ల రహదారికి శివనాగేంద్ర నగర్ గా నామకరణ చేయాలని తాత్కాలిక కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమాన్ని ఆకుతోట ల్యాండ్ సర్వే కన్సల్టెన్సీ అధినేత ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా 33వ డివిజన్ కార్పొరేటర్ భర్త, కాంగ్రెస్ నాయకుడు ముష్కమళ్ల సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, కమిటీ సభ్యులు స్థానిక సమస్యలను అతిథుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ముష్కమళ్ల సుధాకర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9న మొదటి సమావేశాన్ని నిర్వహించి, వెంటనే కాలనీ ఏర్పాటును పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నాగమయ్య టెంపుల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం సాధిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన సీపీ సన్ ప్రీత్ సింగ్ ను కలిసిన బీజేపీ నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమీషనర్ గా సన్ ప్రీత్ సింగ్ (ఐపీఎస్) ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. కాగా, భారతీయ జనతా పార్టీ సీనియర్ జాతీయ నాయకులు, వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గజెల్లి శ్రీరాములు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో సన్ ప్రీత్ సింగ్ రాణించాలని, సంఘ విద్రోహశక్తులకు కట్టడి చేయడంలో పోలీసింగ్ అమలు చేయాలని వారు ఆకాంక్షించారు. సన్ ప్రీత్ సింగ్ విధినిర్వహణలో విజయం సాధించడానికి పరిస్థితులు అనుకూలంగా సహకరించాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, వన్నాల శ్రీరాములు ఆకాంక్షించారు.

# పబ్లిక్ వాయిస్.. వరంగల్ వాయిస్

## విజయవంతంగా నాలుగేళ్ల ప్రస్తానం

- ప్రజల గొంతుకగా నిలుస్తోంది : - బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నలుబొల రమేష్
- సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు : గడ్డం భాస్కర్
- సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతోంది : గడ్డం కేశవమూర్తి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పబ్లిక్ వాయిస్ ను తన వాయిస్ గా వినిపిస్తోంది వరంగల్ వాయిస్. డిజిటల్ రంగంలో తనకు తానే సాటి అన్నట్లుగా దూసుకుపోతోంది. ప్రజల గొంతుకగా నిలుస్తూ వారి సమస్యలపై గర్జిస్తోంది.. ప్రజా క్షేమం కోరే వారికి అండగా నిలుస్తోంది. ప్రజాహితమే పరమావధిగా పనిచేస్తోంది. అదే విధంగా అక్రమార్కుల భరతం పట్టే పనిలో పడింది. పత్రిక స్థాపించిన అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నది. విజయవంతంగా నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పత్రిక కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జర్నలిస్టుల సన్మాన కార్యక్రమాన్ని నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీఎస్ జెన్ కో ఏసీపీ నలుబొల రమేష్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వరంగల్ వాయిస్ దిన పత్రిక ప్రజల గొంతుకగా నిలుస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవడంతోపాటు వాటికి పరిష్కార మార్గాలు చూపడంలో వరంగల్ వాయిస్ ముందు నిలుస్తోందన్నారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఒక పత్రిక నిలదొక్కుకోవడం సామాన్యమైన విషయం కాదన్నారు. అయితే సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు పోవడంలో వరంగల్ వాయిస్ దినపత్రికకు మరేదీ సాటిసారదని కొనియాడారు. అనంతరం ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మాట్లాడూతూ సమకాలీన పరిస్థితులకు వరంగల్ వాయిస్ అద్దం పడుతోందన్నారు. ప్రజల అవసరాలు, సమస్యలను ఉన్నది ఉన్నట్టుగా ప్రజెంట్ చేయడం ద్వారా అందరికీ వరంగల్ వాయిస్ చేరువైందన్నారు. స్టాఫ్, జర్నలిస్టులు అందరూ కూడా కుటుంబ సభ్యుల్లా కలిసి కట్టుగా పత్రిక పురోభివృద్ధిలో భాగస్వాములుగా నిలుస్తున్నారన్నారు. సాయంత్రం అయిందంటే చాలు వరంగల్ వాయిస్ పత్రిక కోసం సెల్ లో అన్వేశిస్తున్నారంటే పత్రిక ఎంతగా ప్రజాభిమానాన్ని చూరగొన్నదో అర్థమవుతోంది. అయితే ఇంతటితో ఆగకుండా మరిన్ని ఉత్తమ కథనాలతో దూసుకుపోయేందుకు మావంతు కృషి చేస్తాం. ఇందుకు జర్నలిస్టులు కూడా తమవంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన జర్నలిస్టులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వరంగల్ వాయిస్ సీఈఓ గడ్డం సాహిత్, న్యూస్ నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, బ్యూరో, డెస్క్ ఇంచార్జి గోలి రవి, టెక్నికల్ ఇంచార్జి వెన్ను రాము, హనుమకొండ స్టాఫ్ రిపోర్టర్ సిద్దోజు రాకేశ్, పర్వతగిరి రిపోర్టర్ సంతోష్ కుమార్, దామెర శ్రీకాంత్, పరకాల బొజ్జం చొక్కారావు, మహబూబాబాద్ ఆకుల నవీన్, మల్హార్ ఎం.గణపతి, నడికుడ మహేందర్, డోర్నకల్ ఠాకూర్ రాజేందర్ సింగ్, ధర్మసాగర్ శివలాల్ యాదవ్, ములుగు ఘనపూర్ టి.యుగేందర్, మహదేవపూర్ ఆర్. రాజబాబు, చెన్నారవుపేట రంజిత్, రేగొండ బి.ఆనంద్, టేకుమట్ల సురేశ్ యాదవ్, తొర్రూర్ చరేశ్, చిట్యాల ఎస్. రంగాచారి, హసన్ పర్తి కనుకుంట్ల స్వరూప సతీష్ లను అతిథులు ఘనంగా సన్మానించారు. అనంతరం అతిథులను వరంగల్ వాయిస్ యాజమాన్యం శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. చివరగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తిని అతిథులు, వరంగల్ వాయిస్ కుటుంబ సభ్యులు శాలువా కప్పి, తలపాగ పెట్టి ఘనంగా సన్మానించారు. పిలువగానేవచ్చి సమావేశాన్ని సక్సెస్ చేసిన వారందరికీ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.















# పబ్లిక్ వాయిస్.. వరంగల్ వాయిస్

**విజయవంతమైన నాలుగేళ్ల ప్రస్థానం**

































EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com